

పారదర్శకంగా కౌంటింగ్ ప్రక్రియ

- వీడియో చిత్రీకరణ, సీసీ కెమెరాల నిఘాలో ఓట్ల లెక్కింపు
- వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయసునీత



మాట్లాడుతున్న కలెక్టర్ విజయసునీత, పక్కన ఆర్వోలు భావన వశిష్ఠ, అభిషేక్

పాడేరు, మే 23(ఆంధ్రజ్యోతి): ఎటువంటి అపోహలు, అనుమానాలకు తావులేకుండా పూర్తిస్థాయి పారదర్శకంగా కౌంటింగ్ ప్రక్రియను నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయసునీత ఆదేశించారు. పాడేరు, అరకులోయ, రంపచోడవరం అసెంబ్లీ స్థానాలకు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియపై రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు కలెక్టరేట్ నుంచి గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. కౌంటింగ్‌కు సంబంధించిన అన్ని ఏర్పాట్లను అధికారులు ముందుగానే పూర్తి చేయాలన్నారు. అలాగే స్ట్రాంగ్‌రూమ్ నుంచి కౌంటింగ్ హాలుకు ఈవీఎంలను తీసుకువచ్చినప్పటి నుంచి కౌంటింగ్ పూర్తయ్యే వరకు ప్రతి అంశం వీడియో చిత్రీకరణ జరగాలన్నారు. అందరూ ఎన్నికల నిబంధనలను పక్కాగా పాటించాలని, కౌంటింగ్ హాలులో 14 టేబుళ్లు ఎదురెదురుగా వేయాలని ఆమె సూచించారు. జూన్ నాలుగున ఉదయం 5గంటలకే రేండమైజేషన్, టేబుళ్ల కేటాయింపు జరగాలని, కౌంటింగ్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలో బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి టేబుల్‌కు ఒక కౌంటింగ్ సహాయకుడు, ఒక పర్యవేక్షకుడు, ఒక సూక్ష్మ పరిశీలకుడు ఉంటారని, ప్రతి రౌండ్ పూర్తయిన వెంటనే ప్రకటించాలని తెలిపారు. తొలుత పోస్టల్ ఓట్లను లెక్కించాలని, ఆ తరువాత నుంచి ఈవీఎంల ఓట్ల లెక్కింపు ప్రారంభించాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియ మొత్తం క్లోజ్ మెస్‌లో మాత్రమే జరగాలని, కౌంటింగ్ ఏజెంట్లు సైతం మెస్ బయటనే ఉండాలన్నారు. కౌంటింగ్ కేంద్రాలకు మూడంచెల భద్రత ఉంటుందని, మొబైల్ ఫోన్లకు అనుమతి లేదన్నారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన పాస్ ఉన్న మీడియా ప్రతినిధులకు మాత్రమే అనుమతి ఉంటుందని, వాళ్ల సైతం దూరం నుంచే ఫొటోలు, వీడియోలు చిత్రీకరించాలన్నారు. మొత్తం కౌంటింగ్ ప్రక్రియలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విజయవంతం చేయాలని కలెక్టర్ విజయసునీత ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో పాడేరు, అరకులోయ, రంపచోడవరం రిటర్నింగ్ అధికారులు భావన వశిష్ఠ, అభిషేక్, ప్రశాంత్‌కుమార్, డీఆర్‌వో పద్మావతి, కౌంటింగ్‌కు సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

సజావుగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణ

- డీఆర్‌వో పద్మావతి



ఇంటర్ విద్యాశాఖ, ఇతర అధికారులతో చర్చిస్తున్న డీఆర్‌వో పద్మావతి

పాడేరు, మే 23 (ఆంధ్రజ్యోతి): ఈనెల 24 నుంచి జరిగే ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలను సజావుగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి పి.పద్మావతి అన్నారు. కలెక్టరేట్‌లో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలపై వివిధ శాఖల అధికారులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా 24 నుంచి జరిగే ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు అవసరమైన ఏర్పాట్లు పక్కాగా చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 21 పరీక్షా కేంద్రాల్లో 1,4162 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు మొదటి సంవత్సరం, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటలకు రెండో ఏడాది విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. అలాగే పాడేరు రెవెన్యూ డివిజన్ పరిధిలో 42 జూనియర్ కళాశాలకు చెందిన 7,417 మంది విద్యార్థులు 13 కేంద్రాల్లో, రంపచోడవరం రెవెన్యూ డివిజన్ పరిధిలో 31 జూనియర్ కళాశాలలకు చెందిన 6,745 మంది విద్యార్థులు 8 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలకు హాజరవుతారన్నారు. ప్రతి పరీక్షా కేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ విద్య ప్రత్యేకాధికారి వినోద్‌బాబు, జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, గిరిజన సంక్షేమ విద్యాశాఖ డీడీ ఐ.కొండలరావు, ఆర్‌టీవో ఎస్.లీలాప్రసాద్, ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి.నవీన్‌కుమార్, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు గిరిజన యువకుడు ఎంపిక



బుద్దు

అరకులోయ, మే 23: ఖేలో భారత్ యూత్ గేమ్స్ నేషనల్ చాంపియన్‌షిప్- 2024 పోటీల్లో పాల్గొనేందుకు అరకులోయ మండలం పెదలబుడు పంచాయతీ గరడగుడ గ్రామానికి చెందిన గిరిజన యువకుడు కిల్లో బుద్దు ఎంపికయ్యాడు. ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం వారణాసిలో ఖేలో భారత్ యూత్ గేమ్స్ ఫెడరేషన్ ఇండియా ఆధ్వర్యంలో ఈ పోటీలు మూడు రోజుల పాటు నిర్వహిస్తారు. అథ్లెటిక్స్, మారథాన్ పోటీల్లో పాల్గొనేందుకు వెళుతున్నట్టు బుద్దు తెలిపాడు.

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు,
9985411639
ఆంధ్రజ్యోతి దినపత్రిక చందాదారులుగా చేరాలన్నా, పత్రిక సరఫరాలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఈ నెంబరుకు సంప్రదించగలరు.
9985411029

గ్రీన్ సిగ్నల్

డొంకరాయి పవర్ కెనాల్ నిర్వహణ పనులకు అనుమతులు మంజూరు

- రేపటి నుంచి వచ్చే నెల 10 వరకు పనులు
- పొల్లూరు, డొంకరాయి జల విద్యుత్ కేంద్రాల్లో నిలిచిపోనున్న విద్యుదుత్పత్తి

సీలేరు, మే 23:

సీలేరు కాంప్లెక్సు పరిధిలోని డొంకరాయి పవర్ కెనాల్ మరమ్మతు పనులు ఈ నెల 25 నుంచి నిర్వహించేందుకు ఏపీ జెన్‌కో అధికారులు సమాయత్తమవుతున్నారు. డొంకరాయి పవర్ కెనాల్ నిర్మించి యాభై ఏళ్లు పైబడడంతో డ్యాం అండ్ సేఫ్టీ నిపుణుల సూచనల మేరకు ఏపీ జెన్‌కో అధికారులు ప్రతి ఏటా కెనాల్ నిర్వహణ పనులు చేపడుతుంటారు. ఏడాది పొడవునా సీలేరు కాంప్లెక్సు నుంచి గ్రిడ్ డిమాండ్ మేరకు విద్యుదుత్పత్తిని చేపడుతుంటారు.



డొంకరాయి పవర్ కెనాల్

సీలేరు కాంప్లెక్సు పరిధిలోని పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి నీరందించేందుకు నిర్మించిన 16 కిలోమీటర్ల పొడవు ఉన్న డొంకరాయి పవర్ కెనాల్‌లో నిత్యం నీరు ప్రవహిస్తూనే ఉంటుంది. ప్రతి ఏటా మే నెల చివరిలో నీటి నిల్వలు తగ్గుముఖం పడుతున్న క్రమంలో కెనాల్ నిర్వహణ పనులకు గ్రిడ్ అధికారులు అనుమతులను మంజూరు చూస్తుంటారు. ఈ క్రమంలోనే స్థానిక జెన్‌కో అధికారులు డొంకరాయి కెనాల్ నిర్వహణ పనులకు అనుమతులు కోరగా, ఇటీవల సీలేరు పర్యటనకు వచ్చిన ఏపీ జెన్‌కో జల విద్యుత్ కేంద్రాల డైరెక్టర్ ఎంవీవీ సత్యనారాయణ 16 కిలోమీటర్ల కెనాల్‌ను పరిశీలించారు. ఈ మేరకు ఈ నెల 25 నుంచి జూన్ 10వ తేదీ వరకు అంటే 15 రోజుల పాటు కెనాల్ నిర్వహణ పనులకు ఎల్‌సీ అనుమతులు మంజూరు కావడంతో జెన్‌కో అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. 16 కిలోమీటర్ల పొడవు ఉన్న కెనాల్ రెండు రీచ్‌ల్లో కెనాల్‌కు ఎక్కడెక్కడ గ్రౌటింగ్ పనులు, కాంక్రీట్ పనులను నిర్వహించాలో గుర్తించి కాంప్లెక్సు పరిధిలోని కాంట్రాక్టర్లకు పనులను అప్పగించేందుకు జెన్‌కో అధికారులు సమాయత్తమవుతున్నారు. డొంకరాయి పవర్ కెనాల్ నిర్వహణ పనుల నేపథ్యంలో ఈ నెల 25 నుంచి జూన్ 10వ తేదీ వరకు డొంకరాయి, పొల్లూరు జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి నిలిచిపోతుందని, సీలేరులో మాత్రం యధావిధిగా విద్యుదుత్పత్తి నిర్వహించనున్నట్టు సమాచారం. ప్రస్తుతం సీలేరు కాంప్లెక్సులో 5 నుంచి 5.5 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది.

జోరుగా పనస విక్రయాలు

- చిట్రాళ్లగొప్పు మార్కెట్‌లో సందడి



చిట్రాళ్లగొప్పులో విక్రయానికి సిద్ధం చేసిన పనస పండ్లు

చింతపల్లి, మే 23: మండలంలో ఉద్యాన పంటల మార్కెట్‌గా ప్రత్యేక గుర్తింపు పొందిన చిట్రాళ్లగొప్పులో పనస విక్రయాలు ఊపందుకున్నాయి. చింతపల్లి, జీకేవీధి మండలాల రైతులు ఉద్యాన పంటలను చిట్రాళ్లగొప్పు మార్కెట్‌కి తీసుకొచ్చి విక్రయాలు జరుపుతుంటారు. ప్రతి ఏటా మే నుంచి ఆగస్టు వరకు చిట్రాళ్లగొప్పు మార్కెట్‌లో అనాస, పనస విక్రయాలు జరుగుతుంటాయి. మైదాన ప్రాంతాలకు చెందిన వర్తకులు ఇక్కడికి వచ్చి కొనుగోలు చేస్తుంటారు. అలాగే ఇక్కడ నుంచి హైదరాబాద్, విజయవాడ, తుని, విశాఖపట్నం ప్రాంతాలకు వర్తకులు ఎగుమతి చేస్తుంటారు. ప్రతి ఏటా రూ.లక్షల్లో అనాస, పనస క్రయ, విక్రయాలు జరుగుతుంటాయి. అనాస దిగుబడులు ఈ ఏడాది ఆలస్యమయ్యాయి. ప్రస్తుతం పనస దిగుబడులు రావడంతో రైతులు చిట్రాళ్లగొప్పు తీసుకొచ్చి విక్రయిస్తున్నారు. రైతులు గ్రామాల నుంచి తీసుకొచ్చిన పనసను స్థానిక వర్తకులు గుత్తగా కొనుగోలుచేసి ... మిగతా 8వ పేజీలో

భారీగా విద్యుత్ వినియోగం

ఎండలు మండిపోతుండడమే కారణం

- పెరుగుతున్న అప్రకటిత కోతలు
- నిర్వహణ పనుల కోసమేనంటున్న అధికారులు
- అధికారికంగా ఎక్కడా కోతలు విధించడం లేదని ప్రకటనలు



విద్యుత్ వినియోగం (మిలియన్ యూనిట్లలో...)

తేదీ	2022	2023	2024
మే 15	28.100	31.376	28.763
మే 16	27.816	32.070	27.903
మే 17	25.981	32.371	28.377
మే 18	26.151	31.374	29.057
మే 19	23.008	31.473	28.743
మే 20	24.765	30.271	30.133
మే 21	26.060	31.450	30.631
మే 22	24.812	31.301	30.547

విశాఖపట్నం సర్కిల్‌లో రోజువారీ సగటు వినియోగం 28.364 మిలియన్ యూనిట్లు. కాగా బుధవారం 2.183 మి.యూనిట్లు అధికంగా ఉపయోగించారు. అంటే 20,18,300 యూనిట్లు ఎక్కువ వాడేశారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఇది తక్కువేనని, ఇంకా ఎక్కువ వినియోగించే రోజులు ముందున్నాయని అధికారులు చెబుతున్నారు.

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఎండలు మండిపోతున్నాయి. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. వాతావరణంలో మార్పులు వచ్చి వర్షాలు పడతాయనుకుంటే కనీసం సాయంత్రం పూట గాలులు కూడా వీయడం లేదు. ఒకటే ఉక్కపోత. తట్టుకోలేనంత వేడి. దీంతో విద్యుత్ వినియోగం అనూహ్యంగా పెరిగిపోయింది. సాధారణ డిమాండ్‌కు మించి వాడేస్తున్నారు. ఏసీల కొనుగోళ్లు పెరిగాయి. అంతా సాయంత్రం ఏడింటికే వాటిని ఆన్ చేస్తున్నారు. ఈ డిమాండ్‌కు తగ్గట్టుగా ఈపీడీసీఎల్ అధికారులు గత ఏడాదే ఎక్కడికక్కడ అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినా సమస్యలు తప్పడం లేదు. ఓవర్ లోడ్ వల్ల కొన్నిచోట్ల లైన్లు ట్రిప్ అవుతున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో ఫ్యూజులు పోతున్నాయి. ఎవరికి విద్యుత్ లేకపోయినా వెంటనే ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తుండడంతో ఆ ఏరియాలో మరమ్మతుల కోసం అందరికీ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. ఇలాంటివి సమస్యను బట్టి అరగంట నుంచి గంట సమయం తీసుకుంటున్నాయి. ఇలా అనేక ప్రాంతాల్లో రిపేర్ల కోసం ఆపుతున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో నిర్వహణ పనులు పేరుతో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నారు. సాధారణంగా ఈ పనులు వర్షాలు పడే ముందు చేపడతారు. చెట్ల కొమ్మలను కొట్టడం వంటివి చేస్తారు.

అయితే ఇప్పుడు విద్యుత్ లోడ్‌ను తగ్గించడానికి ప్రత్యామ్నాయ విధానంగా ఈ నిర్వహణ పనులు చేపడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇలా ఒక్కో ఏరియాలో ఒక్కో రోజు ఆరు గంటలు విద్యుత్ నిలిపివేస్తే ఇతర ప్రాంతాలకు సర్దుబాటు చేయడానికి అధికారులు ఇలా చేస్తున్నారనే అనుమానాలు ఉన్నాయి. కారణాలేవైతేనేమి జిల్లాలో ప్రజలు కొన్ని గంటల పాటు విద్యుత్ సమస్యలు ఎదుర్కొంటున్నారు.

ఎక్కడా విద్యుత్ కోతలు లేవు

విశాఖపట్నం సర్కిల్‌లో ఎక్కడా విద్యుత్ కోతలు లేవు. డిమాండ్‌కు సరిపడా విద్యుత్ అందిస్తున్నాము. నిర్వహణ పనులు, మరమ్మతుల కోసమే అక్కడక్కడ కొద్దిసేపు ఆపుతున్నాము. అంతకు మించి అధికారికంగా ఎక్కడా విద్యుత్ సరఫరా ఆపడం లేదు.

- మహేంద్రనాథ్, ఎస్ఈ, విశాఖ సర్కిల్

పచ్చిరొట్ట విత్తనాల కోసం ఎదురుచూపులు

తొలకరి వర్షాలు పడడంతో నాట్లుకు రైతులు సన్నద్ధం

- ఇప్పటికీ ఆర్‌బీకేలకు సరఫరా చేయని వైసీపీ ప్రభుత్వం

చింతపల్లి, మే 23:

జిల్లాలో ఆదివాసీ రైతులు పచ్చిరొట్ట ఎరువు విత్తనాల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రతి ఏటా ఖరీఫ్ సాగుకు ముందు రైతులు పొలాల్లో పచ్చిరొట్ట ఎరువు నాట్లు వేసుకుని భూమిలో కలియదున్నుకుని సేంద్రియ ఎరువును పంటలకు అందించుకుంటున్నారు. తొలకరి వర్షాలు కురియడంతో రైతులు పచ్చిరొట్ట ఎరువు సాగుకు సన్నద్ధమవుతున్నారు. అయితే ఇప్పటికి ఆర్‌బీకే, వ్యవసాయ కార్యాలయాలకు రాయితీ పచ్చిరొట్ట ఎరువు విత్తనాలను వైసీపీ ప్రభుత్వం పంపిణీ చేయలేదు. దీంతో ఆదివాసీలు విత్తనాల కోసం ఆర్‌బీకేల చుట్టూ తిరుగుతున్నారు.



పచ్చిరొట్ట ఎరువును భూమిలో కలియదున్నుకుంటున్న రైతు (ఫైల్)



పచ్చిరొట్ట ఎరువు పైరు (ఫైల్)

వ్యవసాయ పంట భూముల్లో మితిమీరిన రసాయన ఎరువులు వాడడం వల్ల నేలలో పంటలకు మేలుచేసే సూక్ష్మజీవులు నశిస్తున్నాయి. నేలలో భూసారం తరిగిపోతున్నది. భూమిలో పోషకాల లోపం, చీడపీడల తాకిడి పెరిగిపోతున్నది. నేలలో సహజ భౌతిక లక్షణాలు దెబ్బతిని వాతావరణ కాలుష్యం అధికమవు తోంది. ఈ సమస్యలన్నింటినీ అధిగమించేందుకు రైతులు సమగ్ర పోషకాల యాజమాన్యంలో ప్రధానంగా పచ్చిరొట్ట పైర్ల పెంపకం చాలా కీలకం. పచ్చిరొట్ట పెంపకం వల్ల భూసారం పెరుగుతోంది. గిరిజన ప్రాంత రైతులు ఖరీఫ్ సాగుకు ముందు వ్యవసాయ భూములో వేసవి దుక్కులు చేసుకుని పచ్చిరొట్ట ఎరువు పైర్లు వేసుకుంటున్నారు. దీంతో పచ్చిరొట్ట ఎరువు పెట్టుకున్న పంట పొలాల్లో నాటిన పంటల నుంచి నాణ్యమైన అధిక దిగుబడులు లభిస్తున్నాయి. దీంతో పచ్చిరొట్ట ఎరువుల పెంపకానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు.

జిల్లాకు అనువైన రకాలు

జిల్లాకి అనువైన పచ్చిరొట్ట ఎరువు రకాలు ప్రధానంగా నాలుగు ఉన్నాయి. జనుము, జీలుగ, పిల్లిపెసర, అలసంద పచ్చిరొట్ట ఎరువును శాస్త్రవేత్తలు సిఫారసు చేస్తున్నారు. ప్రధానంగా వరినాట్లు వేసే పంట పొలాల్లో ఈ పచ్చిరొట్ట ఎరువు ... మిగతా 8వ పేజీలో

పోలీసుల అదుపులో ఒడిశా వేటగాళ్లు

జీకేవీధి, కొయ్యూరు అటవీ ప్రాంతాల్లో అడవి జంతువుల వేట

- ఒడిశా తరలిస్తుండగా పట్టుకున్న పోలీసులు
- 400 కిలోల ఎండిన మాంసం స్వాధీనం



జీకేవీధి పోలీసుల అదుపులో ఉన్న ఒడిశా గిరిజనులు



వేటగాళ్ల వద్ద గోనె సంచుల్లో అడవి జంతువుల మాంసం

గూడెంకొత్తవీధి, మే 23: ఒడిశా నుంచి ఆంధ్రా అటవీ ప్రాంతానికి వేటకు వచ్చిన 14 మంది ఒడిశా వేటగాళ్లను జీకే వీధి పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ఒడిశా మల్కాన్‌గిరి జిల్లా సరిహద్దు ప్రాంతాలకు చెందిన 14 మంది గిరిజనులు ఏడు ద్విచక్ర వాహనాలపై అడవి జంతువులను వేటాడడానికి పది రోజుల క్రితం వచ్చారు. జీకేవీధి, కొయ్యూరు సరిహద్దు ప్రాంతాలైన మర్రిపాకలు, ఎర్రగుండ అగ్రహారం ప్రాంతాల్లో అడవి జంతువులను వేటాడారు. సుమారు 400 కిలోల అడవి జంతువుల ఎండిన మాంసాన్ని గోనె సంచుల్లో కట్టుకుని ద్విచక్ర వాహనాలపై గురువారం సాయంత్రం ఒడిశాకు బయలు దేరారు. వారిని గూడెంకొత్తవీధిలో అటవీశాఖ సిబ్బంది పట్టుకుని సోదా చేశారు. వారి వద్ద ఎండిన అడవి జంతువుల మాంసం ఉండడంతో స్వాధీనం చేసుకున్నారు. ఆ 14 మందిని అదుపులోకి తీసుకుని జీకే వీధి పోలీసులకు అప్పగించారు. దీనిపై స్థానిక అటవీశాఖ సిబ్బంది.. డీఎఫ్‌వో సూర్యనారాయణ పడాల్‌కు సమాచారం ఇచ్చారు. శుక్రవారం డీఎఫ్‌వో ఆధ్వర్యంలో విచారణ జరిపి చర్యలు తీసుకోనున్నారు.

పాఠశాలలకు పుస్తకాలు

ఉమ్మడి జిల్లాలో గల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 21,71,180 పాఠ్య పుస్తకాలు అవసరం

- ఇప్పటివరకూ 6,20,000 రాక
- మండలాలకు పంపుతున్న అధికారులు



విశాఖ ఆటోనగర్‌లోని జిల్లా పుస్తక విక్రయ కేంద్రం నుంచి ప్రభుత్వ పాఠ్య పుస్తకాలను వివిధ పాఠశాలలకు తరలిస్తున్న దృశ్యం

విశాఖపట్నం, మే 23: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసేందుకు అవసరమైన పాఠ్య పుస్తకాలు గాజువాక ఆటోనగర్‌లో గల గోదాముకు చేరుకుంటున్నాయి. ఇక్కడ నుంచి అధికారులు పాఠశాలలకు పంపుతున్నారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని 46 మండలాల్లో గల ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఒకటి నుంచి ఏడో తరగతి విద్యార్థులకు 21,71,180 పుస్తకాలు అవసరం. అయితే ఇప్పటివరకూ గాజువాకలో గల జిల్లా పాఠ్య పుస్తక విక్రయ కేంద్రం గోదాముకు మూడో వంతు కంటే తక్కువ...కేవలం 6,20,000 వరకూ మాత్రమే వచ్చాయి. గత ఏడాది మిగిలిపోయినవి రెండు లక్షల వరకూ ఉన్నాయి. మొత్తం కలిపితే 8,20,000. ప్రస్తుతం వీటిని ఆర్టీసీ కార్గో సర్వీస్‌లలో అన్ని మండలాలకు పంపుతున్నారు. పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసేందుకు కార్గో సర్వీస్‌ను జిల్లా ఉప విద్యాశాఖాధికారిని స్వర్ణలత రెండు రోజుల క్రితం ప్రారంభించారు. ఇదిలావుండగా ఒకటి నుంచి ఏడో తరగతి వరకు (నాలుగో తరగతి మినహా) పాఠ్య పుస్తకాలు ప్రస్తుతం కార్యాలయానికి చేరాయి. ఇవి కూడా తక్కువగానే వచ్చాయి. ఈ వారం లోగా పూర్తిస్థాయిలో పాఠ్యపుస్తకాలు వచ్చే అవకాశం ఉందని జిల్లా పాఠ్యపుస్తకాల డిపో మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. ఆయా పాఠశాలలు ఇచ్చిన ఇండెంట్ ఆధారంగా పాఠ్య పుస్తకాలు పంపుతున్నా మన్నారు. కాగా ఈ ఏడాది 8, 9, 10 తరగతుల పాఠ్యపుస్తకాలు నేరుగా ఆయా మండలాల విద్యాశాఖాధి కారుల కార్యాలయాలకు చేర్చే విధంగా చర్యలు చేపడుతున్నారు. జూన్ 12వ తేదీ నాటికి విద్యార్థులకు పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలకు పంపిణీ చేసేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నారు.

క్రైం... crime news

విద్యుదాఘాతంతో వృద్ధురాలి మృతి


చినతల్లి (ఫైల్)

రోలుగుంట, మే 23: మండలంలోని అడ్డసరం పంచాయతీ శివారు నిండిపురంలో విద్యుదాఘాతానికి గురై పాము చినతల్లి అనే వృద్ధురాలు మృతి చెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం అర్ధరాత్రి వీచిన గాలులకు చెట్టు కొమ్మ విరిగి విద్యుత్ వైర్లపై పడడంతో మంటలు వ్యాపించాయి. విద్యుత్ వైరు తెగి చినతల్లి ఇంటి సమీపంలో పడింది. మంటల భయంతో చినతల్లి ఇంట్లో నుంచి బయటకు రావడంతో ఆమె కాలుకు విద్యుత్ వైరు తగలడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుమారుడు పి.దేముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ సురేశ్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


మృతుడు రమణ (ఫైల్ ఫొటో)

కొత్తూరు, మే 23 : అనకాపల్లి మండలం రొంగలివానిపాలెం జంక్షన్ వద్ద ట్రాక్టర్‌ను ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు మృతిచెందాడు. ఇందుకు సంబంధించి అనకాపల్లి రూరల్ పోలీసు స్టేషన్ హెచ్‌సీ సోంబాబు తెలిపిన వివరాలివి. విశాఖపట్నం జిల్లా పాత గోపాలపట్నానికి చెందిన యల్లబిల్లి రమణ (35) డాక్ యార్డులో సెక్యూరిటీ గార్డుగా కాంట్రాక్ట్ ప్రాతిపదికన పనిచేస్తున్నాడు. గురువారం కుంచంగిలో ఉన్న బంధువుల ఇంటికి వచ్చాడు. అక్కడి నుంచి కాయగూరలు కొనుగోలు చేసేందుకు ద్విచక్ర వాహనంపై కూండ్రం వెళ్లి తిరిగి కుంచంగి వస్తుండగా, మార్గమధ్యలో ఆర్‌వీపాలెం వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీ కొన్నాడు. తీవ్ర గాయాలకు గురైన అతనిని అనకాపల్లి ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు. మృతుని భార్య దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ తెలిపారు.

అట్టుడికిన అనకాపల్లి

పోలీసులకు వ్యతిరేకంగా నిరసన గళాలు

- లాఠీచార్జి చేసిన ఖాకీలు.. రాళ్లు రువ్విన ఆందోళనకారులు
- టియర్ గ్యాస్ ప్రయోగం, గాల్లోకి కాల్పులు
- ఈ దృశ్యాలను చూసిన పట్టణవాసుల్లో భయం..భయం..
- చివరకు పోలీసు శాఖ మాబ్ ఆపరేషన్ డ్రిల్ అని తెలిసి ఊపిరి పీల్చుకున్న జనం


నెహ్రూచౌక్‌లో పోలీసులపై రాళ్లు రువ్వుతున్న ఆందోళనకారులు

అదో రద్దీ ప్రదేశం.. ఎవరి పనుల్లో వారు నిమగ్నమై ఉన్నారు. సాయంత్రం నాలుగున్నర గంటలైంది. ఉన్నట్టుండి ఒక్కసారిగా ప్లకార్డులు చేతబట్టి ఆందోళనకారులు రోడ్డెక్కారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఖాకీలు సైతం సంయమనం పాటించాలని మైక్ ద్వారా సూచించారు. అయినా వారు వెనక్కి తగ్గలేదు. చేసేది లేక ఇట్నుంచి పోలీసులు లాఠీచార్జి చేసి చెదరగొట్టగా, అట్నుంచి ఆందోళనకారులు రాళ్లు రువ్వారు. ఆ తరువాత అక్కడ చిన్నపాటి రణరంగంగా మారింది. పట్టణం నడిబొడ్డున గురువారం సాయంత్రం చోటుచేసుకున్న భయానక దృశ్యాలివి. తమ కళ్లముందు ఏం జరుగుతుందో తెలియక అక్కడివారంతా అవాక్కయ్యారు. కాసేపటి తరువాత ఇది పోలీసు శాఖ ఆధ్వర్యంలో జరిగిన మాబ్ ఆపరేషన్ డ్రిల్ అని తెలుసుకుని అంతా ఊపిరి పీల్చుకున్నారు. గంటపాటు సాగిన ఈ కార్యక్రమం ఆద్యంతం అందరినీ ఆకట్టుకుంది.


గాలిలోకి కాల్పులు


వాటర్ ఫైరింగ్ ప్రయోగం

అనకాపల్లి టౌన్, మే 23 : హింసాత్మక సంఘటనలు జరిగినప్పుడు, పెద్దపెద్ద ఆందోళనలు చోటు చేసుకున్నప్పుడు ఆందోళనకారులను ఏ విధంగా చెదరగొట్టి.. శాంతిభద్రతలను పరిరక్షిస్తారో ప్రజలకు పోలీసులు కళ్లకు కట్టినట్టు చూపించారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు గురువారం సాయంత్రం పట్టణంలోని నెహ్రూచౌక్‌లో జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు మాబ్ ఆపరేషన్ డ్రిల్ నిర్వహించారు. ముందుగా పోలీస్ సిబ్బంది సివిల్ దుస్తుల్లో ఆందోళనకారులుగా వ్యవహరించారు. పోలీసులు డౌన్ డౌన్, పోలీసుల జులుం నశించాలి' అని వీరు నినాదాలు చేస్తూ ధర్నా చేపట్టారు. దీంతో ఎన్నికల దృష్ట్యా ఎటువంటి ఆందోళనలకు దిగరాదని పోలీసులు మైక్‌లో హెచ్చరికలు చేసినా ఆందోళనకారులు వినిపించుకోకపోవడంతో ముందుగా లాఠీచార్జి చేసి చెదరగొట్టారు. ఆందోళనకారులు రాళ్లు రువ్వడంతో టియర్ గ్యాస్ వదిలారు. వాటర్ పంపుల ద్వారా ఫైరింగ్ చేశారు. అయినప్పటికీ ఆందోళనకారులు లెక్కచేయక పోవడంతో గాల్లోకి కాల్పులు జరిపారు.


లాఠీచార్జి

ఈ ఘటనలో ఒక వ్యక్తి తీవ్ర గాయాలకు గురికాగా, వెంటనే పోలీసులే అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించిన సన్నివేశాలు స్థానికులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పోలీస్ సిబ్బంది సమయస్ఫూర్తిగా వ్యవహరిస్తూ శాంతిభద్రతలను పరిరక్షించడమే ధ్యేయంగా ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మాబ్ ఆపరేషన్ మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ మాబ్ ఆపరేషన్ డ్రిల్‌లో పాల్గొన్న పోలీస్ సిబ్బందికి, ఫైర్ సర్వీస్ సిబ్బందికి జిల్లా ఎస్పీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, అనకాపల్లి డీఎస్పీ ఎస్.అప్పలరాజు, పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ, నర్సీపట్నం డీఎస్పీ జి.ఆర్.ఆర్.మోహన్, ఎస్బీ డీఎస్పీ అప్పారావు, దిశ డీఎస్పీ ఎం.ఉపేంద్ర బాబు, ట్రైనీ డీఎస్పీ భవ్య, ఇన్‌స్పెక్టర్లు మన్మథరావు, సతీష్, శంకరరావు, శ్రీనివాసరావు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


పరిస్థితులను పరిశీలిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ తదితర పోలీసు ఆఫీసర్లు

కౌంటింగ్ ఫీవర్

- ఎక్కడ చూసినా ఓట్ల లెక్కింపుపైనే చర్చ
- జూన్ నాలుగున హోటళ్లు, రిసార్టులకు డిమాండ్
- స్నేహితులతో కలిసి ఫలితాలు వీక్షించేందుకు ఏర్పాట్లు
- రూమ్‌ల అడ్వాన్సు బుకింగ్

విశాఖపట్నం, మే 23 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఎక్కడచూసినా ఓట్ల లెక్కింపునకు సంబంధించిన చర్చే నడుస్తోంది. రాష్ట్ర శాసనసభతోపాటు పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు వచ్చే నెల నాలుగో తేదీన వెల్లడి కానున్నాయి. ఏపీ అసెంబ్లీ ఎన్నికలపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలో రకరకాల విశ్లేషణలు కొనసాగుతున్నాయి. పోలింగ్ తమకు అనుకూలంగా జరిగిందంటూ ఇటు కూటమి (టీడీపీ, జనసేన, బీజేపీ), అటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఎవరికి వారు ధీమా వ్యక్తంచేస్తున్నారు. వైసీపీ నాయకులైతే ఒకడుగు ముందుకువేసి వచ్చే నెల తొమ్మిదో తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విశాఖపట్నంలో ప్రమాణ స్వీకారం చేయబోతున్నారని ప్రకటించారు. మరోవైపు తమ విజయం ఖాయమని కూటమి నేతలు విశ్వాసంతో ఉన్నారు. దీంతో ఎవరు విజయం సాధిస్తారో ఒక పట్టాన అంతుచిక్కడం లేదు. ఫలితాలపై బెట్టింగ్‌లు కూడా జోరుగానే జరుగుతున్నాయి. అయితే అత్యధికులు కూటమి మొగ్గు చూపుతుండడంతో 2:1 నిష్పత్తిలో పందాలు సాగుతున్నాయి. ఇదిలావుంటే ఎన్నికల ఫలితాలను గుర్తుండిపోయే రీతిలో వీక్షించాలని చాలామంది ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. స్నేహితులంతా కలిసి ఒకచోట ఉండి టీవీల్లో ఫలితాలను వీక్షించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. ఇందుకోసం నగర శివార్లలో రిసార్టులు, గెస్ట్‌హౌస్‌లతోపాటు నగరంలోని ప్రధాన హోటళ్లు, లాడ్జిల్లో రూమ్‌లను అడ్వాన్స్‌గా బుక్ చేసుకుంటున్నారు. జూన్ నాలుగు తేదీన రూమ్‌ల కోసం డిమాండ్ పెరిగిపోయింది. ఇప్పటికే శివారు ప్రాంతాల్లోని రిసార్టులు, బీచ్‌రోడ్డులోని గెస్ట్‌హౌస్‌లు, నగరంలోని పలు స్టార్ హోటళ్లలో రూమ్‌లు దాదాపు ఫుల్ అయిపోయినట్టు నిర్వాహకులు చెబుతున్నారు.

‘పేట’లో పోలీసులు కార్డన్ సెర్చ్

- విస్తృతంగా తనిఖీలు
- రికార్డులు లేని 66 వాహనాలు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న వాహనాలతో డీఎస్పీ మోహన్, సీఐలు, ఎస్ఐలు

పాయకరావుపేట, మే 23 : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ త్వరలో జరగనున్న నేపథ్యంలో గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇందులో భాగంగా గురువారం తెల్లవారుజామున నర్సీపట్నం డీఎస్పీ ఆధ్వర్యంలో పాయకరావుపేట, నక్కపల్లి, నర్సీపట్నం టౌన్, రూరల్ సీఐలు, ఎస్ఐలు సిబ్బందితో కలిసి పాయకరావుపేటలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ కాలనీ, దుర్గాకాలనీలలో ఇంటింటినీ విస్తృతంగా తనిఖీలు చేశారు. సక్రమంగా రికార్డులు లేని 66 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పాయకరావుపేట సీఐ పి.అప్పలరాజు మాట్లాడుతూ వాహనాల యజమానులు సరైన రికార్డులు చూపించి, తమ వాహనాలను తీసుకు వెళ్లవచ్చునన్నారు.

అల్లూరిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం

- సీతమ్మవారి కొండను అభివృద్ధి చేయాలి
- అల్లూరి యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ‘పడాల’


అల్లూరి విగ్రహం వద్ద వీరభద్రరావు తదితరులు

పాయకరావుపేట రూరల్, మే 23: విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అల్లూరి సీతారామరాజు యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పడాల వీరభద్రరావు అన్నారు. మండలంలోని సీతమ్మవారి కొండను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు చరిత్రలో ప్రధానమైన నాలుగు సంవత్సరాల పాటు తపస్సు చేసిన గోపాలపట్నం సీతమ్మవారి కొండను ప్రభుత్వం అభివృద్ధి చేయాలన్నారు. ఈ కొండపై వెలసిన ఉమాధర్మలింగేశ్వరస్వామిని, దుర్గాదేవిని దర్శించుకోవడానికి నిత్యం భక్తులు వస్తుంటారన్నారు. వేల సంవత్సరాల చరిత్ర కలిగిన సీతమ్మ వారి కొండ ఆలయం అభివృద్ధిపై దృష్టి సారించి, రోడ్డును కూడా నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షురాలు వాడపల్లి వెంకటరమణమ్మ, కార్యదర్శి లక్కాకుల బాబ్జి, జైబాబు, శివాజీ రాజు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	133.00
లైవ్ ధర	153.00
విత్ స్కిన్	276.00
స్కిన్ లెస్	286.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

రోడ్లు ఇలా.. ప్రయాణాలు ఎలా..?

- అస్తవ్యస్తంగా వెల్చూరు-పెదకలవలాపల్లి రహదారి
- రాళ్లు తేలి, గుంతలమయంగా మారడంతో రాకపోకలకు జనం అవస్థలు
- ఐదేళ్లుగా ఇదే దుస్థితి ఉన్నా పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

రాంబిల్లి, మే 23:

ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి రహదారుల దుస్థితి దర్పణంగా నిలుస్తోంది. ఓవైపు ఎక్కడికక్కడ రాళ్లు తేలడం.., మరో వైపు గుంతలమయం కావడంతో వీటిపై ప్రయాణం అంటేనే జనం హడలిపోతున్నారు. అందునా గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారుల దుస్థితి మరీ దారుణంగా ఉంది. కనీసం మరమ్మతులైనా చపట్టండి మహాప్రభో.. అని పల్లె జనం వేడుకుంటున్నా చెవిన వేసుకునేవారు కరువయ్యారు. ఫలితంగా ఈ రహదారుల్లో తరచూ ప్రమాదాలు జరుగుతూ పలువురు గాయాలకు గురవుతుండగా, వాహనాలు పాడవుతున్నాయని ఆయా యజమానులు గగ్గోలు పెడుతున్నారు.


సంతపాలెం జంక్షన్ నుంచి వెల్చూరు మీదుగా పెదకలవలాపల్లి వెళ్లే రహదారి దుస్థితి


పెదకలవలాపల్లి వద్ద పూర్తిగా పాడైన రహదారి



మండలంలోని సంతపాలెం నుంచి వెల్చూరు మీదుగా పెదకలవలాపల్లి వెళ్లే రోడ్డు పూర్తిగా శిథిలమైంది. దీంతో రాకపోకలకు జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డులో నిత్యం వెల్చూరు, పెదకలవలాపల్లి, వై.లోవ గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. సుమారు మూడు కిలోమీటర్లు దూరం ఉన్న ఈ రోడ్డు గత ఐదు సంవత్సరాలుగా పూర్తిగా శిథిలమైంది. అడుగడుగునా భారీగా గోతులు పడి, రాళ్లు తేలాయి. రోడ్డు అంచులు సైతం కోతకు గురయ్యాయి. దీంతో తరచూ ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షాలు కురిసే సమయాల్లో ఈ రోడ్డుపై ప్రయాణం అంటే ప్రత్యక్ష నరకమనే చెప్పాలి. వర్షపు నీరు ఆయా గోతుల్లో చేరడంతో ఎక్కడ గొయ్యి ఉందో, ఎక్కడ రోడ్డు ఉందో గుర్తించలేని విధంగా ఉంటుంది. ఆ సమయంలో పాదచారులు సైతం అవస్థలు పడుతుంటారు. ఈ రోడ్డుపై పగటి పూట ప్రయాణం ఎలాగోలా చేయవచ్చునని, రాత్రి వేళ మాత్రం ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లి వస్తున్నామని పైమూడు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. రహదారి నిర్మాణం మాట అటుంచితే, కనీసం మరమ్మతులైనా చేపట్టండి మహాప్రభో అని వేడుకుంటున్నా పట్టించుకునేవారు కరువయ్యారని గగ్గోలు పెడుతున్నారు. ప్రస్తుతం వేసవి కాలంలో కావడంతో రహదారుల మరమ్మతులు చేపట్టడానికి ఇదే సరైన సమయమని, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని అంతా కోరుతున్నారు.

రారెత్తించిన భానుడు

నిర్మానుష్యంగా మారిన రహదారులు

కె.కోటపాడు, మే 23: మండల కేంద్రమైన కె.కోటపాడు, పరిసర ప్రాంతాల్లో గురువారం భానుడు రారెత్తించాడు. ఉదయం ఎనిమిది గంటల నుంచే సూరీడు ప్రతాపం చూపడంతో ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు ప్రజలు బెంబేలెత్తిపోయారు. సాయంత్రం ఐదు గంటల వరకు ఎండ తీవ్రత కొనసాగింది. ఎండ వేడిమి తీవ్రంగా ఉండడంతో ఉదయం పదకొండు గంటలకల్లా ప్రధాన రహదారులన్నీ బోసిపోయాయి. ఎండకు తోడు వేడి గాడ్పులతో వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గత ఐదు రోజులుగా భానుడు ప్రతాపాన్ని మరింత అధికంగా చూపిస్తుండడంతో నిత్యం రద్దీగా ఉండే కె.కోటపాడు మూడు రోడ్ల కూడలితో పాటు మండలంలోని పలు రహదారులన్నీ బోసిపోయాయి. అత్యవసర పనులుంటే తప్ప ఎవరూ బయటకు వచ్చేందుకు సాహసించలేదు. అత్యధిక శాతం ప్రజలు ఇళ్లకే పరిమితమవ్వడంతో వ్యాపార సముదాయాలన్నీ వెలవెలబోయాయి.


నిర్మానుష్యంగా ఉన్న మాడుగుల ఘాట్ రోడ్డు జంక్షన్


పెద్దగా జనసంచారం లేని కె.కోటపాడు మూడు రోడ్ల కూడలి

వెలవెలబోయిన కోనాం సంత

చీడికాడ: గత వారం రోజులుగా మండుతున్న ఎండలతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ భానుడు కన్నెర్ర చేయడంతో జనం విలవిల్లాడుతున్నారు. గురువారం మండలంలోని కోనాంలో జరిగిన వారపు సంతకు జనం లేకపోవడంతో చిరు వ్యాపారులు ఇబ్బందులకు గురయ్యారు. ముఖ్యంగా కోనాం ఏజెన్సీతో పాటు ఐటీడీఏ గ్రామాల నుంచి గిరిజనులు పండించిన అటవీ ఉత్పత్తులను ఉదయం ఆరు గంటలకే తీసుకువచ్చిన గిరిజనులు ఏడు నుంచే ఎండ వేడిమి ప్రారంభం కావడంతో వ్యాపారులు అడిగిన ధరలకే సరకులను విక్రయించి తొమ్మిది గంటలకల్లా స్వగ్రామాలకు వెళ్లిపోయారు. కాగా పలువరు చిరు వ్యాపారులు తెచ్చిన కూరగాయలు, నిత్యావసర సరకుల కొనుగోలుకు జనం లేకపోవడంతో వారు ఇబ్బందులకు గురయ్యారు. సంతలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో సూరీడు ప్రతాపం నుంచి రక్షణ పొందేందుకు టార్పాన్ల కింద తలదాచుకున్నారు. అయితే ఒకపక్క ఎండ, మరోపక్క వడగాల్పులతో సాయంత్రం వరకూ అవస్థలు పడ్డారు. కాగా మండలంలో శిరిజాం గ్రామానికి చెందిన కుమ్మరి కార్మికులు తాము తయారుచేసిన కుండలను గురువారం కోనాం సంతకు తీసుకువచ్చినప్పటికీ కొనుగోలుదారులు రాకపోవడంతో తీవ్ర నిరాశతో వాటిని తీసుకుని ఇంటి ముఖం పట్టారు.

ఇళ్లకే పరిమితమవుతున్న ప్రజలు

మాడుగుల-రూరల్: మండలంలో ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజలు ఇళ్లకే పరిమితం అవుతున్నారు. ఉదయం తొమ్మిది నుంచే తీవ్రంగా ఉంటున్న భానుడి ప్రతాపం మధ్యాహ్నానికి మరింత అధికం కావడంతో బయటకు వచ్చేందుకు జనం జంకుతున్నారు. మండే ఎండకు తోడు ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. సాయంత్రం ఐదు గంటలు దాటినా ఎండ తీవ్రత తగ్గకపోవడంతో పొలం పనులకు వెళ్లే రైతులు, కూలీలు ఇబ్బందులకు తీవ్ర గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండ ప్రభావంతో మధ్యాహ్నం సమయంలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. మధ్యలో వర్షాలు కురుస్తున్నా ప్రయోజనం ఉండడం లేదని పలువురు పేర్కొంటున్నారు.


కోనాం సంతలో కొనుగోలుదారుల కోసం ఎదురుచూపులు

అప్పన్నకు రెండో విడత చందనం సమర్పణ


స్వామికి చందనం సమర్పిస్తున్న అర్చకులు

సింహాచలం, మే 23: వరాహలక్ష్మీనృసింహస్వామికి రెండో విడత చందన సమర్పణ గురువారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాత ఆరాధనలు పూర్తి చేశారు. ఆలయ ఆస్థాన మండపంలో ఉత్సవమూర్తిని ఉభయ దేవేరులతో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ అంతరాలయంలో మూలవిరాట్‌కు తొలుత చందన సమర్పణ చేసి, శీతలోపచారాలు ఇచ్చిన తరువాత నీరాజనాలు సమర్పించారు. ఆస్థాన మండపంలో స్థానాచార్యుల పర్యవేక్షణలో ప్రధానార్చకులు సారథ్యంలో అర్చక బృందం ఉత్సవమూర్తికి విశేషంగా పంచామృతాలతో, పలు రకాల పండ్ల రసాలు, పవిత్ర గంగధార జలాలతో అభిషేకాలు జరిపారు. అనంతరం ఉత్సవమూర్తిని చందన కిరీటంతో అలంకరించి హారతులిచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఓ సింగాల శ్రీనివాసమూర్తి, ఈఈ డీజీ శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

కేజీబీవీ టీచర్ల పనితీరు మదింపు

- భవిత కేంద్రాల్లోని ప్రత్యేక ఉపాధ్యాయుల పనితీరు కూడా పరిశీలన
- విద్యా శాఖ ఆదేశం
- సమగ్ర శిక్షా అభియాన్ అధికారులకు బాధ్యత
- ప్రభుత్వం తీరుపై టీచర్లు అభ్యంతరం

విశాఖపట్నం, మే 23 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ) ఉపాధ్యాయులు, భవిత కేంద్రాల్లో పనిచేస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయుల పనితీరు మదింపు చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. దీనిపై ఉపాధ్యాయులు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు. కేజీబీవీలు ఏర్పాటైన తరువాత ఎప్పుడూ లేని విధానాలను ఉన్నతాధికారులు అవలంబిస్తున్నారని అంటున్నారు. కేజీబీవీల్లో పనిచేసే కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్లు (సీఆర్‌టీలు), భవిత కేంద్రాల్లోని ప్రత్యేక ఉపాధ్యాయులను ప్రతి ఏడాది విద్యా సంవత్సరంలో ఒకరోజు విరామంతో కొనసాగిస్తుంటారు. ఏడాదిలో ఒకరోజు మాత్రమే సర్వీస్ బ్రేక్ ఉంటుంది. ఈ ఏడాది గత నెల 24వ తేదీతో విద్యా సంవత్సరం ముగిసింది. ఒకరోజు ముందు అంటే 23వ తేదీతో వీరి సర్వీస్‌కు విరామం ఇచ్చిన అధికారులు తిరిగి జూన్ తొమ్మిదో తేదీ వరకూ మాత్రమే పొడిగింపు ఇచ్చారు. దీనిపై అప్పట్లోనే కేజీబీవీ టీచర్లంతా అనుమానం వ్యక్తంచేశారు. ఈనేపథ్యంలో కేజీబీవీ, భవిత కేంద్రాల్లో టీచర్ల పనితీరు మదింపు చేయాలని తాజాగా ఉన్నతాధికారులు నిర్ణయించి జిల్లాలకు ఆదేశించారు.

ఉమ్మడి జిల్లాలో 34 కేజీబీవీలలో సుమారు 700 మంది, వందకుపైగా భవిత కేంద్రాల్లో పనిచేసే సుమారు 100 మంది టీచర్ల పనితీరు మదింపు (20 మార్కులకు) బాధ్యతను సమగ్ర శిక్షా అభియాన్ అధికారులకు అప్పగించారు. దీనికి సంబంధించి ఫార్మెట్ కాపీలు వచ్చాయి. పనితీరు బాగాలేదన్న సాకుతో కొందరిని బయటకు పంపేందుకు ఉన్నతాధికారులు యత్నిస్తున్నారని ఉపాధ్యాయులు కొందరు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. గత ఏడాది తమ డిమాండ్ల సాధనకు కేజీబీవీ టీచర్లు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. దానిని గుర్తు పెట్టుకుని ఉన్నతాధికారులు ఇప్పుడు కక్షసాధింపునకు దిగుతారేమోనన్న ఆందోళనను వ్యక్తంచేస్తున్నారు. ఒకపక్క పనితీరు మదింపుపై కసరత్తు చేస్తున్న ఉన్నతాధికారులు మరోవైపు వేసవి సెలవులతో సంబంధం లేకుండా టెన్త్, ఇంటర్ తప్పిన విద్యార్థినులకు ప్రత్యేక తరగతులు నిర్వహించే బాధ్యతను టీచర్లకు అప్పగించారు. సుమారు నెలరోజుల నుంచి ఈ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. పదో తరగతిలో ప్రభుత్వ బడుల కంటే కేజీబీవీలు మెరుగైన ఫలితాలు సాధించాయని, ఉన్నతాధికారులు గమనించాలని వారు కోరుతున్నారు.

అనుమతులు లేకపోయినా రాకపోకలే!

- భారీ వాహనాలతో పరవాడ ప్రజలు బేజారు


పరవాడ రహదారిలో భారీ వాహనాల రద్దీ

పరవాడ, మే 23: మండల కేంద్రం పరవాడ ప్రధాన రహదారి గుండా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మునగపాక మండలం వెంకటాపురం వద్ద గల ఓ పరిశ్రమకు ముడిసరకును తరలించే భారీ వాహనాలన్నీ పరవాడ మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ రహదారి గుండా భారీ వాహనాలకు అనుమతులు లేకపోయినప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా వాహనదారులు వ్యవహరిస్తున్నారని ఈ ప్రాంత ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసలే కొన్నిచోట్ల ఇరుకు రోడ్లని ఇటువంటి పరిస్థితుల్లో జరగరానికి జరిగితే బాధ్యత ఎవరు వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. అంతేకాకుండా భారీ వాహనాల వల్ల తరుచూ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. రహదారి కూడా దెబ్బతింటుందని పలువురు వాపోతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి భారీ వాహనాల రాకపోకలను అరికట్టాలని అంతా కోరుతున్నారు.

ఓట్ల లెక్కింపునకు సహకరించండి

» అరకు అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి అభిషేక్



సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ ఆఫీసర్ అభిషేక్... పాల్గొన్న పలు పార్టీల అభ్యర్థులు, నాయకులు

అరకులోయ, మే 23: ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు రాజకీయ పార్టీలు సహకరించాలని అరకు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో వి.అభిషేక్ కోరారు. మండల రెవెన్యూ కార్యలయంలో ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, నాయకులతో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కిపు ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించి రాష్ట్రంలోనే గిరిజన ప్రాంతాన్ని ఆదర్శంగా నిలవాలన్నారు. కౌంటింగ్ సమయంలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని ,ర్యాలీలకు అనుమతులు ఇవ్వడం లేదని నిలుపుదామన్నారు. గత ఎన్నికలతో పోలిస్తే అరకు అసంబ్లీ నియోజక వర్గంలో పోలింగ్ శాతం పెరిగిందన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను పక్కాగా అమలు చేశామన్నారు. అలాగే కమిషన్ ఆదేశాల మేరకు ఓట్ల లెక్కింపు ప్రకియ చేపడతామన్నారు. లెక్కింపులో జాప్యం లేకుండా అందరూ సహకారం అందించాలని కోరారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్లను లెక్కించనున్నట్టు చెప్పారు. అనంతరం ఈవీఎంలను స్ట్రాంగ్‌రూం నుంచి కౌంటింగ్‌కు తరలించి లెక్కించాలని సూచించారు. రాజకీయ పార్టీల ఏజెంట్లు బయటకు వెళ్లేటపుడు రిలీవర్‌కు ఐడీ కార్డులు అప్పగించాలని ఆయన చెప్పారు.

ఈ సందర్భంగా ఏఎస్పీ ధీరజ్ మాట్లాడుతూ 144 సెక్షన్ అమలులోనే ఉంటుందన్నారు. లౌడు స్పీకర్లు, బాణసంచాలు,టపాసులు పేల్చడానికి అనుమతులు లేవని స్పష్టం చేశారు. ప్రశాంత వాతావరణంలో లెక్కంపు ప్రకియ పూర్తి చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని చెప్పారు. పోలింగ్ ప్రక్రియ గిరిజన ప్రాంతంలో ప్రశాంతంగా, విజయవంతంగా పూర్తి చేయడం ఆనందంగా ఉందన్నారు. అలాగే ఓట్ల లెక్కింపు కూడా జరుగుతుందన్నారు. లెక్కింపు కేంద్రాలు, పరిసరాల్లో సీసీ కెమెరాలు, సీఆర్ పీఎఫ్ జవాన్లకు భద్రత ఉంటుందన్నారు. ఏజెంట్లకు గుర్తిపు కార్డులు లేక పోతే అనుమతించేది లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎస్డీసీ వీవీఎస్.శర్మ, తహసీల్దార్లు సుధాకర్, సోమేశ్వరరావు, వివిద పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లు పాల్గొన్నారు.



టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఈశ్వరిని కలిసిన వర్తక సంఘం నాయకులు

పాడేరులో టీడీపీదే విజయం

» వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి బేతాళుడు

చింతపల్లి, మే 23: పాడేరు నియోజకవర్గంలో టీడీపీదే విజయమని చింతపల్లి వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు అన్నారు. గురువారం పాడేరు వెళ్లిన వర్తక సంఘం నాయకులు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గిడ్డి ఈశ్వరిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీలో భారీగా వ్యతిరేకత పెరిగిందని, ఈ ఎన్నికల్లో మెజారిటీ ప్రజలు టీడీపీకి ఓటు వేశారని చెప్పారు. చింతపల్లి, జీకే వీధి మండలాల్లో మెజారిటీ ఓట్లు టీడీపీకి పడ్డాయన్నారు. ప్రాథమిక అంచనా ప్రకారం పాడేరు నియోజక వర్గంలో కచ్చితగా టీడీపీ అభ్యర్థి గిడ్డి ఈశ్వరి ఎనిమిది నుంచి పది వేల మెజారిటీ వస్తుందన్నారు. నియోజకవర్గంలో చింతపల్లి మండలంలోనే టీడీపీకి భారీ మెజారిటీ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు దూనబోయిన రమణ తదితరులు పాల్గొన్నారు.

వంగసార ఆశ్రమంలో ప్రత్యేక పూజలు



ఆశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు కృష్ణారావు

చింతపల్లి, మే 23: మండలంలోని వంగసార ఆశ్రమంలో గురువారం ప్రత్యేక పూజలు జరిగాయి. వైశాఖ పౌర్ణమి పురస్కరించుకుని అన్నపూర్ణ విశాలాక్షి సహిత కాశీవిశ్వనాథునికి అభిషేకాలు, నవగ్రహ సహిత సర్వదేవతా హోమం, సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు కృష్ణారావు, గ్రామ పెద్దలు మహేశ్, లక్ష్మి, చిన్నమ్మి, కమలమ్మ పాల్గొన్నారు.

క్షయ నియంత్రణకు టీకాలు



శిబిరంలో గిరిజనుడికి టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

గూడెంకొత్తవీధి, మే 23: క్షయ నియంత్రణకు టీకాల కార్యక్రమం ప్రారంభించామని జీకే వీధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి అచ్యుత్ తెలిపారు. గురువారం పీహెచ్‌సీ పరిధిలోని రింతాడ గ్రామంలో క్షయ నియంత్రణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ కేసులను గణనీయంగా తగ్గించాలనే లక్ష్యంతో 18 ఏళ్లు నిండిన వ్యక్తులకు అడల్ట్ బీసీసీ వ్యాక్సినేషన్ చేస్తున్నామన్నారు. ఆరు కేటగిరీలకు చెందిన వ్యక్తులకు ఈ టీకాలు వేస్తున్నామని, ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ నిర్మల, హెచ్ఏ సత్యనారాయణ, పారామెడికల్ ఉద్యోగులు కుమారి, రాజేశ్వరి, నాగమణి, కుమారి తదితరులు పాల్గొన్నారు.

గదబపాలెంలో ప్రత్యేక వైద్య శిబిరం



చిన్నారికి ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

కొయ్యూరు, మే 23: మండలంలోని గదబపాలెం గ్రామంలో హెల్పింగ్ హ్యాండ్స్, అల్లూరి యువజన సంఘం ప్రతినిధులు గురువారం ప్రత్యేక చిన్నపిల్లల వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో నర్సీపట్నం ప్రైవేటు ఆస్పత్రి చిన్నపిల్లల వైద్య నిపుణులు ఉమానారాయణ 150 మంది పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేశారు. రోగాలతో బాధపడుతున్న చిన్నారులకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ చైర్మన్ మల్లేశ్వరరావు, ప్రతినిధులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాల కోసం ఎదురుచూపులు

... 5వ పేజీ తరువాయి

నాటుకుని 45-55 రోజుల తరువాత భూమిలో కలియదున్నుకోవడం వల్ల పంటలకు అవసరమైన పంటలకు అవసరమైన నత్రజని, భాస్వరం, పొటాష్ పూర్తి స్థాయిలో అందుతుంది.

ఇప్పటికీ ఆర్‌బీకేలకు చేరని రాయితీ విత్తనాలు

భూసారాన్ని పెంపొందించే పచ్చిరొట్ట ఎరువు విత్తనాలను వైసీపీ ప్రభుత్వం ఏప్రిల్ ఆఖరి వారంలోనూ పంపిణీ చేయలేదు. గతంలో టీడీపీ ప్రభుత్వం పచ్చిరొట్ట ఎరువులను 90 శాతం రాయితీపై పంపిణీ చేసేది. వైసీపీ ప్రభుత్వం మూడేళ్లుగా 70 శాతం రాయితీపై పంపిణీ చేస్తోంది. తొలకరి వర్షాలు కురిసిన వెంటనే రైతులు వేసవి దుక్కులు చేసుకుని పచ్చిరొట్ట ఎరువు నాట్లు వేసుకోవడం ఆనవాయితీ. ఈ ఏడాది తొలకరి వర్షాలు కురుస్తుండడం, నాట్లు వేసుకునేందుకు విత్తనాలు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు.

పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు పంపిణీ చేయాలి



ప్రభుత్వం పచ్చిరొట్ట ఎరువు విత్తనాలను వెంటనే పంపిణీ చేయాలి. విత్తనాల కోసం ఆర్‌బీకేల వద్దకు వెళితే సిబ్బంది సరైన సమాధానం చెప్పడం లేదు. విత్తనాలు వస్తాయి అంటున్నారే తప్ప ఎప్పుడు వస్తాయనేది కచ్చితంగా చెప్పడం లేదు. ఇప్పటికైనా జిల్లా వ్యవసాయ అధికారులు, కలెక్టర్ స్పందించి రాయితీ పచ్చిరొట్ట ఎరువులు పంపిణీ చేయాలి.

- బేరా సత్యనారాయణ, యర్రబొమ్మలు

వారం రోజుల్లో విత్తనాలు పంపిణీకి చర్యలు



పచ్చిరొట్ట ఎరువు విత్తనాల కోసం జిల్లా వ్యవసాయ అధికారి ద్వారా ప్రభుత్వానికి ఇండెంట్ పంపించాం. పచ్చిరొట్ట ఎరువు విత్తనాలు వారంలో రోజుల్లో మండలాలకు వచ్చే అవకాశం ఉంది. విత్తనాలు వచ్చిన వెంటనే ఆర్‌బీకేల ద్వారా రైతులకు రాయితీపై అందజేస్తాం.

- కంటా జాహ్నవి, ఏడీఏ, చింతపల్లి

విజయోత్సవ ర్యాలీలకు అనుమతులు లేవు

» కొయ్యూరు సీఐ పీవీ రమణ



కంఠారం గ్రామస్థులతో మాట్లాడుతున్న కొయ్యూరు సీఐ రమణ

కొయ్యూరు, మే 23: సార్వత్రిక ఎన్నికలు ఓట్ల లెక్కింపు సందర్భంగా వచ్చే నెల 4వ తేదీన ఎటువంటి విజయోత్సవ ర్యాలీలకు అనుమతులు లేవని కొయ్యూరు సీఐ పీవీ రమణ స్పష్టం చేశారు. మండలంలోని రేవళ్ల, కంఠారం తదితర గ్రామాల్లో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలతో గురువారం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఇటీవల ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో జరిగిన అల్లర్ల నేపథ్యంలో ఎన్నికల కౌంటింగ్ రోజున 144 సెక్షన్ అమల్లో ఉంటుందని చెప్పారు. అందువల్ల ఎక్కడా నలుగురికి మించి ఎక్కువగా గుమిగూడి ఉండరాదని అవగాహన కల్పించారు. ఓట్ల లెక్కింపు అనంతరం కూడా ఎక్కడా ఎటువంటి అనుమతులు లేకుండా విజయోత్సవ ర్యాలీలు, మందుగుండు సామగ్రి పేల్చడం వంటి చర్యలకు పాల్పడకూడదని చెప్పారు. అలాగే ఓట్ల లెక్కింపు రోజున పాడేరు వెళ్లడానికి కూడా అనుమతులు లేనందున ఎవరి గ్రామంలో వారే ఉండాలని గిరిజనులకు సీఐ కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ లోకేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



గిరిజనులకు టీకా మందును అందిస్తున్న వైద్య సిబ్బంది

గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు

ముంచంగిపుట్టు, మే 23: మండలంలోని సుజనకోట, ఏనుగురాయి పంచాయతీల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. పలువురికి అడల్ట్ బీసీజీ (క్షయ వ్యాధికి సంబంధించిన) టీకా మందును అందించారు. అలాగే వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వైద్య సేవలను అందజేశారు. అనంతరం వారికి మందులను కూడా ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి కె.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కిలగాడ పీహెచ్‌సీ పరిధిలో ఉన్న సచివాలయాల్లో ప్రతీ గురువారం టీకా మందును అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బి.కృష్ణవేణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాసపనుకు రోడ్డు పనులు ప్రారంభించాలి



వర్షాలకు కొట్టుకుపోయిన రాసపనుకు రహదారి ఇదే..

జి.మాడుగుల, మే 23: మండలంలోని వంతాల పంచాయతీ కేంద్రం నుంచి రాసపనుకు వరకు నిర్మించిన బీటి రోడ్డు అసంపూర్తిగా నిలిచిపోయింది. వర్షాలకు ఈ రహదారి కొట్టుకుపోయింది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా పనులు చేపట్టం కారణంగా రహదారి పనులు నాణ్యతా ప్రమాణాలు లేవని, అందుకే ఈ దుస్థితి దాపురించింది. స్థానిక సర్పంచ్ ఆరోపించారు. దీంతో రహదారి సౌకర్యం లేక చాలా ఎళ్లు కష్టాలు పడ్డామని, తీరా రహదారి మంజూరైన తరువాత కాంట్రాక్టర్లు, సంబంధిత అధికారుల నిర్లక్ష్యం సరికాదని అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, పాలకులు తక్షణమే స్పందించి రహదారి పనులు ప్రారంభించాలని కోరారు.

యూజేఎఫ్ డైరీల అవిష్కరణ



డైరీలను అవిష్కరిస్తున్న సీఐ రమేశ్

జి.మాడుగుల, మే 23: ఉత్తరాంధ్ర యూజేఎఫ్ డైరీలను సీఐ రమేశ్ ఆధ్వర్యంలో గురువారం అవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర ఆరు జిల్లాల ముఖ్యమైన సమాచారం కలిగిన డైరీలు అవిష్కరించడం శుభపరిణామంగా పేర్కొన్నారు. అలాగే యూజేఎఫ్ నేత రాము మాట్లాడుతూ, జనం కోసం మనం అనే సిద్ధంతో అన్ని జర్నలిస్టు సంఘాలకు అతీతంగా యూజేఎఫ్ పని చేస్తుందని స్పష్టం చేశారు. విలువలతో కూడిన ఈ డైరీలు ప్రతి జర్నలిస్టులకు అందజేయనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నేత రవి, విలేకరులు అరుణ్‌కుమార్, సత్యనారాయణ, అమీర్, జాన్, శ్రీను, గుప్తా పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణానికి ముహూర్తపు రాట



వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ముహూర్తపు రాటను వేస్తున్న భక్తులు

సీలేరు, మే 23: గూడెంకొత్తవీధి మండలంలోని సీలేరులో వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం ముహూర్తపు రాటను వేశారు. ఆలయంలో ఈ నెల 29వ తేదీన పద్మావతి వేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న తరుణంలో ఆలయ ప్రాంగణంలో ఈ రాటను వేసి కల్యాణానికి శ్రీకారం చుట్టారు. ఈ నెల 24న సుప్రభాత సేవ, గణపతి పూజ, పుణ్యాహవచనం వంటి కార్యక్రమాలు, 27న వేంకటేశ్వరస్వామి వారి తిరువీధి మహోత్సవం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పిల్లా సాంబమూర్తి, పలువురు జెన్‌కో ఉద్యోగులు పాల్గొన్నారు.

గోమంగి పీహెచ్‌సీ అటెండర్ కుటుంబంపై దాడి



పాడేరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

పెదబయలు, మే 23: గోమంగి పీహెచ్‌సీలో అటెండర్ కుటుంబం సభ్యులపై దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఎస్ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. గోమంగి పీహెచ్‌సీలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న కొమ్మ సుబ్బారావు మొదటి భార్య ఉండగా, ఐదు నెలల క్రితం రెండో వివాహం చేసుకున్నాడు. దీంతో మొదటి భార్య అంజులమ్మ, రెండో భార్య కుటుంబాల మధ్య తరచూ గొడవలు జరుగుతూ వస్తున్నాయి. ఈ నెల 21న గోమంగి రహదారిలో సుబ్బారావు తండ్రి చిన్నయ్య నడుచుకుంటూ వెళుతుండగా మొదటి భార్య అంజులమ్మ వాగ్వావాదానికి దిగి కర్రతో దాడి చేశారు. ఈ విషయం తెలుసుకున్న సుబ్బారావు అంజులమ్మ ఇంటికి వెళ్లి తన తండ్రిపై ఎందుకు దాడి చేశావని ప్రశ్నించారు. దీంతో అంజులమ్మ, సుబ్బారావు మధ్య వివాదాం పెరిగింది. అంజులమ్మ సోదరుడు, పెదబయలు జడ్పీటీసీ సభ్యుడు బొంజుబాబుతో కలిసి ఐదుగురు వ్యక్తులు సుబ్బారావు, అతని తండ్రి చిన్నయ్య, సుబ్బారావు రెండో భార్య నాగమణిలపైన దాడులు చేశారు. ఈ ఘటనపై సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి

» పశు సంవర్ధక శాఖ డీడీ నరసింహులు



మేకలకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న పశు వైద్య సిబ్బంది

మాకవరపాలెం, మే 23: సీజనల్ వ్యాధులు రాకుండా గొర్రెలు, మేకలకు టీకాలు వేయించాలని పశు సంవర్ధక శాఖ పాడేరు డిప్యూటీ డైరెక్టర్ ఎన్.నరసింహులు తెలిపారు. మండలంలోని తామరం, ఎరకన్నపాలెంలో గురువారం పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు ఉచితంగా వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్నట్టు చెప్పారు. ఈ ప్రక్రియ 20 రోజుల పాటు అన్ని ప్రభుత్వ పశువుల ఆస్పత్రుల పరిధిలో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మండలంలో ఇప్పటివరకు 450 గొర్రెలు, మేకలకు టీకాలు వేసినట్టు ఆయన తెలిపారు. ప్రతీ గ్రామంలోనూ ఈ టీకాల కార్యక్రమం జరుగుతున్నదని, గొర్రెల కాపరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి అనిల్‌కుమార్, అసిస్టెంట్లు రామ్మోహన్, అప్పలనాయుడు, గోపాలమిత్ర నారాయణమూర్తి పాల్గొన్నారు.

☛ సంక్షిప్తంగా..

అనుమతి లేకుండా ఉత్సవాలు చేయొద్దు



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్ఐ సంతోష్‌కుమార్

డుంబ్రిగుడ, మే 23: అనుమతులు లేకుండా ఉత్సవాలు నిర్వహించవద్దని, లేనిపక్షంలో శాఖా పరమైన చర్యలు తప్పవని ఎస్ఐ సంతోష్ కుమార్ హెచ్చరించారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి వచ్చే నెల 4వ తేదీన ఫలితాలు వెలువడే దృష్ట్యా బహిరంగ ప్రదేశాల్లో ఎటువంటి ఉత్సవాలను నిర్వహించకూడదని స్పష్టం చేశారు. అలాగే అల్లర్లు, గొడవలకు తావివ్వకూడదని ఆయన సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయాన్ని నాయకులు, ప్రజలు గ్రహించి తమకు సహకరించాలని ఎస్ఐ కోరారు.

మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రాన్ని సందర్శించిన జడ్పీ చైర్‌పర్సన్



పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మితో చైర్‌పర్సన్ సుభద్ర

ముంచంగిపుట్టు, మే 23: ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రాన్ని విశాఖ ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి గురువారం సందర్శించారు. మొదటిగా వారు వించ్ మార్గంలో జల విద్యుత్ కేంద్రానికి చేరుకున్నారు. అనంతరం ప్రాజెక్టును సందర్శించి జరుగుతున్న విద్యుత్ ఉత్పాదన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ ఎటువంటి రహదారి సౌకర్యంలేని రోజుల్లో కాకులు దూరని చిట్టడవిలో జలవిద్యుత్ కేంద్రాన్ని నిర్మించడం అప్పటి ఇంజనీర్ల నైపుణ్యాన్ని ఇట్టే అర్థం చేసుకోవచ్చునని అన్నారు. తక్కువ కర్చుతో ఎక్కువ విద్యుత్ ఉత్పాదన చేస్తున్న మాచ్ండ్ ప్రాజెక్టు మరో వందేళ్ల పాటు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పని చేయాలని ఆమె అభిలాషించారు. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఇంజనీరింగ్ అధికారులను, కార్మికులను, సిబ్బందిని ఆమె అభినందనలు తెలిపారు. ఆమె వెంట వైసీపీ నేతలు జేవీవీఎస్.మూర్తి, ఎ.జగబంధు, పద్మారావు, దామోదరం, సుబ్బలక్ష్మీ తదితరులు ఉన్నారు.

ఖరీఫ్ సాగుకు విత్తనాలు సిద్ధం



లారీలో నుంచి విత్తనాలు దించుతున్న సిబ్బంది

పెదబయలు, మే 23: ఈ ఏడాడి ఖరీఫ్ సాగు కోసం విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ తెలిపారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా 16 సచివాయాలు ఉండగా, ఒక్కొక్క సచివాలయం నుంచి 40 చొప్పున మొత్తంగా 640 మట్టి నమూనాలు సేకరించామన్నారు. వాటిని విశాఖపట్నం భూసార కేంద్రానికి పంపించినట్టు చెప్పారు. 20 క్వింటళ్ల పచ్చిరొట్ట జనుము, పది క్వింటళ్ల జనము విత్తనాలు అందుబాటులో ఉండగా, దీనికి 90 శాతం రాయితీపై రైతులకు అందజేయడం జరుగుందన్నారు.

జోరుగా పనస విక్రయాలు

... 5వ పేజీ తరువాయి

దుకాణాల్లో వినియోగదారులకు విక్రయిస్తుంటారు. కొందరు గిరిజన రైతులు నేరుగా మైదాన ప్రాంతాల నుంచి వచ్చిన వర్తకులకు పండ్లను విక్రయిస్తుంటారు. ప్రతి రోజు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వివిధ ప్రాంతాల రైతులు ఇక్కడకు పండ్లను తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. అలాగే చిట్రాళ్లగొప్పు మార్కెట్‌లో పలు దుకాణదారులు అన్నివేళలా పండ్లను విక్రయిస్తుంటారు. మార్కెట్ ప్రారంభం కావడంతో రైతులకు గరిష్ఠ ధర లభిస్తున్నది. పనస పండ్ల పరిమాణం, నాణ్యత ఆధారంగా రూ.50 నుంచి రూ.120 వరకు విక్రయిస్తున్నారు. చిట్రాళ్లగొప్పు మార్కెట్‌లో పనస పండ్లు జూలై ఆఖరు వరకు విక్రయాలు జరుగుతాయి.